క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నాం



పెనమలూరు: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే సందర్భంగా డాన్‌బాస్కో నవజీవన్‌బాల భవన్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యధికారిణి సాయిలలిత మాట్లాడుతూ ఆశా వర్కర్లతో పాటు నవజీవన్ బాలభవన్ సహకారంతో వైద్య సేవలు క్షేత్రస్థాయిలో అందిస్తున్నామని వివరించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ వసంతకుమారి మాట్లాడుతూ పిల్లలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండే విధంగా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని కౌన్సెలింగ్ సెంటర్‌కు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిజిలి శ్రీనివాస్, టీచర్లు అన్మిష, తిరుపతమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని



గన్నవరం రూరల్: పాడి రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ ధ్యేయమని చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం పురుషోత్తపట్నం పాలకేంద్రం సందర్శించి పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. అధ్యక్షురాలు కొమ్మినేని విజయలక్ష్మి ఆధ్వర్యంలో యూనియన్ వజ్రోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి సగటున 205 లీటర్లు పాలసేకరణ జరుగుతుండగా లీటరుకు రూ.73 చెల్లిస్తున్నట్లు తెలిపారు. మహిళా పాడి రైతులను ఘనంగా సత్కరించారు. ప్రతి నెలా రైతులకు నగదు చెల్లిస్తూ, నాలుగు నెలలకొకసారి బోనస్‌లు అందజేస్తూ పాడి రైతులకు అండగా నిలిచిన ఏకైక సహకార సంస్థ కృష్ణామిల్క్ యూనియన్ అని చెప్పారు. జిల్లా డైరెక్టర్లు పలగాని కొండలరావు, పాలడుగు నాని, రూట్ మేనేజర్ తుమ్మల యశ్వంత్, పాలకేంద్రం డైరెక్టర్లు పాల్గొన్నారు. అధ్యక్షురాలు విజయలక్ష్మిని చలసాని సత్కరించారు.


మాజీ సర్పంచి కాసరనేనికి సతీ వియోగం



అహల్య (ఫైల్)

గన్నవరం: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, గన్నవరం మాజీ సర్పంచ్ కాసరనేని గోపాలరావుకు సతీవియోగం కలిగింది. ఆయన సతీమణి అహల్య (65) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానిక పాతగన్నవరంలోని స్వగృహంలో ఆమె భౌతిక కాయాన్ని పట్టణ ప్రముఖులైన కార్యదర్శి తోట వెంకయ్య, కాసరనేని రంగబాబు, కోటగిరి వరప్రసాదరావు, నెక్కలపూడి ఈశ్వరరావు, సీనియర్ న్యాయవాది కేవీ. రమణ, ఉప సర్పంచ్ పాలడుగు నాని, బీబీ.గూడెం సొసైటీ మాజీ అధ్యక్షుడు బోయపాటి బుల్లియ్య, పలు రాజకీయ పార్టీల నేతలు, బంధుమిత్రులు సందర్శించి నివాళులర్పించారు. కాసరనేని గోపాలరావును పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



ఉయ్యూరు: ఉయ్యూరు పుల్లేటి కాలువలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. ఉయ్యూరు పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఎడ్ల రాంబాబు (26) ముఠా కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఫ్లోరా వంతెన సమీపంలో పుల్లేటి కాలువలో పడ్డాడు. కాలువలోని తూడు, గుర్రపు డెక్కలో చిక్కుకున్నాడు. గమనించిన స్థానికులు కాలువలోకి దిగి రక్షించేందుకు తీవ్రంగా శ్రమించారు. రాంబాబును ఒడ్డుకు చేర్చే సరికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు రాంబాబు మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు. ఘటనాస్థలానికి పట్టణ పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు.

అడ్డగోలుగా ఇసుక తరలింపు

- పరిమితికి మించి రవాణా
- ఇసుకమయం అవుతున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు



గోసాల సెంటరు మీదుగా వెళ్తున్న ఇసుక లోడు లారీ



గొడవర్రు నుంచి కంకిపాడు వైపు వస్తున్న ఇసుక లోడు లారీ

కంకిపాడు: ఇసుక రవాణా అడ్డగోలుగా సాగుతోంది. పరిమితికి మించి వాహనాల్లో భారీగా లోడు చేయించి రవాణా సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరించటం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. భారీ లోడుతో వస్తున్న వాహనాలతో రహదారులు ఇసుకమయంగా తయారై వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు.

భారీగా ఇసుక తరలింపు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఇసుక పాయల నుంచి ఇసుక రవాణా భారీ స్థాయిలో జరుగుతోంది. ఎంపిక చేసిన రీచ్‌ల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లోని పలు రీచ్‌ల నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీలు, ట్రాక్టర్లు యథేచ్ఛగా రియల్ వెంచర్లు, ఇతర నిర్మాణ రంగ పనులకు ఇసుక తరలిస్తున్నాయి.

పట్టించుకునేవారేరీ..?

ఇసుక తరలింపు పేరుతో రవాణా అడ్డగోలుగా సాగిస్తున్నారు. లారీలు, ట్రాక్టర్ల యజమానులు తమ స్వార్థం కోసం పరిమితికి మించి ఇసుకను నింపి వాహనాలను నడుపుతున్నారు. లోడు వాహనాల ధాటికి రహదారులు సైతం కుంగిపోతున్నాయి. సమీపంలోని భవనాలు సైతం స్వల్పంగా కంపిస్తుండటంతో భవన యజమానులు భయాందోళనలకు గురవుతున్నారు. లారీల్లో 35 టన్నులు నుంచి 45 టన్నుల వరకూ భారీగా ఇసుక నింపి తరలిస్తున్నారు. ఇసుక రవాణాపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

నియమిత వేళలు లేకుండా..

మైనింగ్, విజిలెన్స్, రవాణా, రెవెన్యూ, పోలీసు ఈ శాఖల అధికారులు ఎవరూ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. కూటమి ముఖ్య నేతల అండతో రాత్రిళ్లు అర్ధరాత్రి తరువాత సైతం ఇసుక లోడుతో లారీలు రయ్‌మంటూ దూసుకుపోతున్నాయంటే అధికారుల పనితీరు ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

రహదారులు ఇసుకమయం..

భారీగా లోడింగ్ చేయటంతో ఇసుక మార్గమధ్యంలో రహదారులపై జారిపడుతోంది. రోడ్డు మార్జిన్‌లలో ఇసుక పేరుకుపోవటంతో రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. ఇటీవల పోరంకి సెంటరులో ఓ వాహనదారుడు రోడ్డు దాటుతున్న వ్యక్తిని చూసి ద్విచక్రవాహనాన్ని నిలువరించే క్రమంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఇసుక కారణంగా వాహనం జారి ప్రమాదానికి గురయ్యాడు.

పర్యవేక్షణ అవసరం..

వెలుగు చూడని ఈ తరహా ఘటనలు అనేకం ఉన్నాయి. ఇసుక తరలింపు వాహనాలపై నిఘా ఏర్పాటు చేసి అడ్డగోలు రవాణాకు చెక్ పెట్టాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది.

ఘనంగా రథసప్తమి వేడుకలు



పోరంకిలో స్వామివారి కల్యాణం



చిక్కవరంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెనమలూరు: పోరంకి గ్రామంలో మంగళవారం రథసప్తమి ఘనంగా చేశారు. గ్రామంలోని శ్రీ సూర్యదేవాలయంలో మంగళవారం వేకువజామున సుప్రభాత సేవ నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ చేశారు. ఉదయం స్వామివారి పాదాలను సూర్య కిరణాలు తాకాయి. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఉషా ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణస్వామి దివ్య కల్యాణం కనుల పండుగగా చేశారు. భక్తులు భారీగా రావటంతో స్వామివారి దర్శనానికి చాలా సమయం పట్టింది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం వేళ అలంకరించిన శ్రీ ఉషాపద్మినీ సమేత సూర్యనారాయణ స్వామిని సూర్య కిరణాలు నేరుగా తాకటం భక్తులు దర్శించారు. అనంతరం సామూహిక సూ ర్య నమస్కారాలు జరిగాయి. 108 మంది మహిళా భక్తులు స్వామివారికి పాలపొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. కల్యాణోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు చిట్టినేని వంశీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం రథసప్తమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో జరిగిన విశేష పూజలకు పలు గ్రా మాల్లోని భక్తులు హాజరై అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. పలువురు భక్తులు ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడిని దర్శించుకుని సూర్యనమస్కారాలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ గంగా పార్వతీ సమేతరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో శ్రీసీతా రామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకలను నిర్వహించారు. తొలుత స్వామివారికి సుప్రభాతసేవ, అర్చనలు జరిపారు. అనంతరం శ్రీఆంజనేయస్వామి వారికి సహస్రనామావళి అష్టోత్రలతో 25 వేల తమలపాకులతో పూజలు నిర్వహించారు.ఆలయఅర్చకుడు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. మంగళవారం రథసప్తమికావటంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాత మాకిన సీతారామ పాత్రుడు (విశాఖపట్టణం) సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వర మూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సైఫన్ బాగుచేయాలని రైతుల వినతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ రంగనాథ్‌బాబు

అంబాపురం(విజయవాడరూరల్): గొల్లపూడి కాల్వ సైఫన్ విరిగిపోయి కాల్వనీరు సగభాగం బుడమేరు కాల్వలోకి పోయి వృథా అవుతున్నాయని అంబాపురం గ్రామ రైతులు తెలియజేశారు. మంగళవారం అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వరంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం జరిగింది. రైతులు మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదల్లో గొల్లపూడి కాల్వ సైఫన్ విరిగిపడిపోయిందన్నారు. అప్పటి నుంచి దాన్ని బాగుచేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు కోరారు. దాళ్వా సీజన్‌కి గ్రామంలో 200 ఎకరాల్లో వరిసాగు జరుగుతుందని ఎంఏవో బి.రంగనాథ్ బాబు తెలిపారు. దాళ్వా సీజన్‌లో సాగు చేస్తున్న ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. ఈకేవైసీ చేయించాలన్నారు. ధాన్యం కొనుగోలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందన్నారు. యంత్రపరికరాలు, టార్పాలిన్ పట్టాలు, స్ప్రేయర్లు అందజేయాలని రైతులు అడిగారు. ప్రభుత్వం నుంచి రాగానే సబ్సిడీపై అందజేస్తామన్నారు. వరి పంటకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతులు కోరారు. దీనిపై ఏఓ మాట్లాడుతూ తాడేపల్లి సొసైటీ ద్వారా ఎరువుల అమ్మకాలు జరుగుతాయని తెలిపారు. వీఆర్వో పి.రంగారావు, వీఏఏ విజయచంద్ర, రైతులు పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న కరపత్రాలు

పెనమలూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మరోసారి వివాదాలు చుట్టుముట్టాయి. జ్ఞానేంద్ర అనే వ్యక్తిని, అతని కుటుంబ సభ్యులను చంపటానికి యత్నిస్తున్నారని, దీనికి పెనమలూరు సీఐ, రాజమండ్రి సీఐలతో పాటు పలువురు టీడీపీ నేతలు ఇబ్బందులు పెడుతున్నారని కరపత్రాలు మండల పరిధిలో మంగళవారం హల్‌చల్ చేశాయి. గుర్తు తెలియని వ్యక్తులు కరపత్రాన్ని మండలంలోని ప్రధాన కూడళ్ల వద్ద దుకాణాల వద్ద, ప్రధాన రహదారులపై వేకువజామున వేశారు. గత నెల 11వ తేదీన పోలీసుల సహకారంతో కొందరు జ్ఞానేంద్ర కుటుంబాన్ని చంపాలని చూశారని ప్రధాన ఆరోపణ చేశారు. ఈ ఘటనపై డీజీపీ, ఎమ్మెల్యే ఎందుకు స్పందించ లేదని పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్ పేరుతో ఆడపిల్లను కొట్టడమా, బట్టలు విప్పి వీడియో తీయటం న్యాయమా, అని కరపత్రంలో ముద్రించారు. అనూషకు ఏవిధంగా న్యాయం చేయాలను కుంటున్నారని, కులాంతర వివాహం చేసుకుంటే రక్షణ కరువేనా అని కరపత్రంలో ప్రధాన అక్షరాలతో ముద్రించారు.

పోలీసులకు ఫిర్యాదు..?

కాగా ఈ కరపత్రంలో పలువురి పేర్లు ఉండటంతో పేర్లు ఉన్న వారు పెనమలూరు పోలీసులను ఆశ్రయించి మంగళవారం ఫిర్యాదు చేశారని తెలిసింది. తమ ప్రతిష్ఠకు భంగం కలిగే విధంగా కరపత్రాలు ముద్రించారని, దీనిపై విచారణచేసి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దారులు పోలీసులను కోరినట్లు సమాచారం.

ఫిర్యాదు అందింది..

కరపత్రాలపై ఫిర్యాదు అందిందని సీఐ జె.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు విచారణ ప్రారంభించామన్నారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని సీఐ వివరించారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీటీఓ వాణిశ్రీ

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో జరుగుతున్న రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథి జిల్లా ప్రజారవాణా అధికారిణి ఏ.వాణిశ్రీ మాట్లాడుతూ.. డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని సూచించారు. పూర్తి ఏకాగ్రతతో బస్సులను నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లను, ఆహార జాగ్రత్తలను పాటించాలని తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సులను నడపరాదని చెప్పారు. గ్యారేజ్ సిబ్బంది కూడా మంచి కండిషన్ ఉన్న బస్సులను మాత్రమే డ్రైవర్లకు ఇవ్వాలని తెలిపారు. వాహనాలకు వచ్చే మరమ్మతులను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని చెప్పారు. తద్వారా ఆర్టీసీకి ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని నిలబెట్టాలని సిబ్బందిని కోరారు. డిపో మేనేజర్ పి. శివాజీ, సూపర్‌వైజర్లు మధు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మేలు



ఉప్పలూరులోని పీహెచ్‌సీ వద్ద అవగాహనా ర్యాలీలో వైద్య ఆరోగ్య సిబ్బంది



చిన అవుటపల్లి వద్ద ర్యాలీలో ప్రిన్సిపాల్ జె.వందన, అధ్యాపకులు



కానూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కంకిపాడు: క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అంజు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అంజు మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి చికిత్స చేయించటంద్వారా నివారణ సులభతరం అవుతుందన్నారు. వైద్యాధికారి డాక్టర్ సాయి నిఖిత, ఎంపీహెచ్ ఈఓలు కృష్ణారావు, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్‌లు శ్యామల, శారమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనమలూరు: ప్రపంచ క్యాన్సర్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కానూరులో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాల, స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ డే పురస్కరించుకుని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.వందన ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్ ప్రారంభించారు. క్యాన్సర్‌ను ముందే గుర్తించు, ప్రాణాలు రక్షించు అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఅధికారి ప్రశాంతి, డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ వరప్రసాద్,బి.కళ్యాణి, భోదన సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని స్థానిక బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. పిన్నమనేని వైద్య కళాశాల పీజీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. స్కూలు హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, విశ్రాంత వైద్యారోగ్య శాఖ ఉద్యోగి రేవిణిశెట్టి సూర్యనారాయణ, పలువురు పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

వెటర్నరీ విద్యార్థుల ఆందోళన



గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో స్టైఫండ్ పెంచాలని కోరుతూ వెటర్నరీ విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం రెండవ రోజుకు చేరుకుంది. తరగతులను బహిష్కరించిన విద్యార్థులు కళాశాల ఎదుట బైఠాయించి స్టైఫండ్ పెంపు కోరుతూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. విద్యార్థి సంఘ నేతలు మాట్లాడుతూ.. పశువైద్య విద్యార్థులకు గత 12 ఏళ్లుగా స్టైఫండ్‌ కేవలం రూ.7 వేల చొప్పున చెల్లిస్తున్నారని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మిగిలిన వైద్య విద్యార్థులతో సమానంగా వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మూడు నెలలు క్రితం పశుసంవర్థక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం విశ్వవిద్యాలయం ప్రతినిధుల బృందం విద్యార్థులతో చర్చలు జరిపారు. అయితే స్టైఫండ్ పెంపుపై విద్యార్థులు గట్టిగా పట్టుపట్టారు,

మినుము సాగులో మెలకువలు పాటించాలి

పెనమలూరు: మినుము పంట సాగులో రైతులు మెలకువలు పాటించాలని వ్యవసాయశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ మనోహర్ తెలిపారు. పెదపులిపాక, తాడిగడప గ్రామాలలో మంగళవారం 'పొలం పిలుస్తోంది', ఆహారం, పోషకాహార భద్రత పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మినుము పంటలో పల్లాకు తెగులు కబడుతుందన్నారు. పల్లాకు తెగులు నివారణకు రైతులు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. రైతులు మోతాదుకు మించి ఎరువులు విడటం వలన మొక్కలు భౌతిక స్వరూపం మారుతుందని, మొక్క ఎదుగుదల తగ్గిపోతుందన్నారు. రైతులు ఎరువులు, పురుగుల మందులు వాడే సమ యంలో వ్యవసాయ శాఖ సూచనలు తీసుకోవాలన్నారు. కాగా రైతులు తమకు 10- 26- 26 ఎరువుతో పాటు, యూరియా అందుబాటులో లేదని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో కనకమేడల శైలజ, డీఆర్‌సీ జ్యోతిరమణి, పద్మజ, వీఏఏలు షరీఫ్, గోవర్ధిని, శ్రీవాణి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందుల వినియోగం సరికాదని గరికపాడు వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.క్రిష్ణం అన్నారు. ఉప్పలూరులో మినుము పొలాలను శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. క్రిష్ణం మాట్లాడుతూ కలుపు మందులు అధికంగా పిచికారీ చేయటంతో పైరు ఎదుగుదలకు ఆటంకం ఏర్పడిందన్నారు. లాం ఫామ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రతిభశ్రీ, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి.శైలజ, గరికపాడు కేవీకే ప్రతినిధి డాక్టర్ పీఎస్ శివప్రసాద్, పామర్రు ఏడీఏ స్వర్ణలత, ఏఓ పీఎం కిరణ్, వీఏఏ ఎం.సౌజన్య పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు, పొట్టిపాడు గ్రా మాల్లో 'పొలం పిలుస్తోంది' మంగళవా రం నిర్వహించారు. ఎంఏవో హరీష్‌కుమార్ మాట్లాడుతూ మినుము పంటలో బూడిద తెగులు ఉందని, నివారణకు టెబుకొనజాల్‌గానీ, సేఫ్ మందును స్ప్రే చేయాలన్నారు. బంగారు తీగ కలుపును పీకి వేయించి పొలానికి దూరంగా పడవేసి కాల్చివేయాలని సూచించారు. వీఏఏలు రసూల్, రాణి, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



అయోధ్య రామ మందిరం, మసీదు నమూనాను పరిశీలిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



డిప్ ఇరిగేషన్ ఉపయోగం ప్రదర్శిస్తున్న విద్యార్థిని

గన్నవరం రూరల్: విద్యార్థుల్లో ప్రతిభ, సృజన వెల్లడికి ఎడ్యు ఫెయిర్ దోహదం చేస్తుందని విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగే ఎడ్యు ఫెయిర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానాను అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన అయోధ్య రామ మందిరం, మక్కా, చర్చి, వాటర్ సైకిల్, నెయిల్ బెడ్, మ్యూజిక్ కాయిన్ బ్యాక్స్, సీజన్స్, ప్రకృతి పరంగా మనకు లభిస్తున్న వనరులు, పండ్లు, వాటి ఉపయోగాలు, మానవ శరీరం, అవయవ ధర్మాలు, గ్రామీణ వాతావరణం, రైతు గొప్పదనం, డ్రిప్ ఇరిగేషన్, వాటర్ మేనేజ్‌మెంట్ ఆకట్టుకున్నాయి. గవర్నింగ్ బాడీ కన్వీనర్ జి.సాంబశివరావు, సభ్యులు ఆరుమళ్ళ మోహన్‌రెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమామ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ బ్లెస్సీ నేహకు అభినందన



బ్లెస్సీ నేహను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామోజీరావు, హెచ్‌వోడీలు

గన్నవరం రూరల్: విద్యార్థులను బహుముఖంగా తీర్చిదిద్దటం సిద్ధార్థ అకాడమి లక్ష్యమని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు అన్నారు. కళాశాలలో రెండవ సంవత్సరం బీడీఎస్ చదువుతున్న పి.బ్లెస్సీ నేహ అభినందన కార్యక్రమం మంగళవారం జరిగింది. జనవరి 28 నుంచి 30వ తేదీ వరకూ హైదరాబాద్‌లో జరిగిన జాతీయ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ 2024- 25 పోటీలలో సీనియర్ ఉమెన్ 53 కేజీల కేటగిరిలో పాల్గొని క్యాంస్య పతకాన్ని ఆమె సాధించింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం బ్లెస్సీ నేహను సత్కరించారు. మరిన్ని విజయాలు సాధించాలని, విద్యార్థులు నేహను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఏవో వై.మధుసూదనరావు, కోచ్ అంకమ్మరావు, హెచ్‌వోడీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన రమణ

పెనమలూరు: గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి చేపల కుండీల ప్రాంతానికి చెందిన అత్తా రమణ (51) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. అతను స్థానిక కార్పొరేట్ కాలేజీలో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. కాగా గత నెల 31వ తేదీన అతను బీడీలు కొనటానికి చేపల కుండీల వద్ద ఉన్న తన ఇంటి నుంచి వచ్చి బీడీలు కొని బందరు రోడ్డు దాటుతుండగా అతనిని విజయవాడ వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో ఉన్న అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు బజారు నిర్మాణానికి వేసిన పిల్లర్ల తొలగింపు



రామవరప్పాడులో రైతు బజారు పిల్లర్లు, పునాదులను తొలగించిన దృశ్యం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు జాతీయరహదారి సమీపంలో అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూరల్ మండలంలో రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల ప్రజల ప్రయోజనార్థం కార్మికుల కార్యాలయం, రైతు బజారు ఏర్పాటుకై శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి పనుల నిమిత్తం కార్మికుల కార్యాలయం నిర్మాణాన్ని పూర్తి చేశారు. రైతు బజారు నిర్మాణానికై పునాదులు వేసి పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యింది. సుమారు 40 సెంట్లలో రైతు బజారు ఏర్పాటుకై రూ.1.9 కోట్లు వ్యవసాయ మార్కెట్ శాఖ నుంచి నిధులు కూడా మంజూరయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వంలో ఈ అభివృద్ధి పనులను కూటమి నాయకులు దగ్గరుండి మరీ తొలగిస్తుండటం వివాదస్పదమైంది.